బీటీ రోడ్డు అస్తవ్యస్తం!

- నెరవేరని ప్రభుత్వ లక్ష్యం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



మట్టి రోడ్డుగా మారిన బీటీ రోడ్డు

ధారూరు: ఉమ్మడి రాష్ట్రంలో నిర్మించిన రోడ్డు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కనీస మరమ్మతులకు నోచుకోక ఆనవాళ్లు సైతం కోల్పోయింది. ప్రజల ఉపయోగార్థం వేసిన రోడ్డు మట్టిరోడ్డుగా తయారవ్వడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదని స్థానికులు చెబుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి గిరిజనశాఖ నుంచి అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఈ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ సగం వరకే రోడ్డు నిర్మించి మమ అనిపించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి నూతన ప్రభుత్వం కొలువుదీరడంతో రోడ్డు పనులు కాస్తా మరుగున పడ్డాయి. అప్పట్లో సగం వరకు నిర్మించిన బీటీ రోడ్డు 11 సంవత్సరాలుగా మరమ్మతులు లేక అస్తవ్యస్తంగా తయారైంది. ఈ విషయంలో పట్టించుకునే అధికారులు కరువయ్యారు. ధారూరు మండల కేంద్రంలోని ఈద్గా సమీపం నుంచి మున్నూరుసోమారం గ్రామం వరకు మెటల్ కం బీటీ రోడ్డు నిర్మాణానికి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనశాఖ నుంచి రూ.1.42 కోట్లు మంజూరు చేసింది. 2009, ఫిబ్రవరి 2న అప్పటి గనులు, భూగర్భ వనరులు, చేనేత జౌళిశాఖ మంత్రి పి సబితారెడ్డి పనులు ప్రారంభానికి శంకుస్థాపన చేశారు. వివిధ కారణాలతో కాంట్రాక్టర్ రెండు సంవత్సరాల తర్వాత పనులను కొనసాగించారు. ధారూరు నుంచి అల్లీపూర్ శివారు సుద్దగనుల వరకు బీటీ రోడ్డును నిర్మించారు. అక్కడి నుంచి మున్నూరుసోమారం వరకు నిర్మించాల్సిన రోడ్డు నిర్లక్ష్యానికి గురైంది. చివరగా ఫార్మేషన్ రోడ్డు వేసి మమ అనిపించారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడం, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ అసంపూర్తి రోడ్డు నిర్మాణ విషయంలో నిర్లక్ష్యం చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో స్థానిక ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో వేసిన సంగం రోడ్డు కూడా గుంతలు, మెట్టలతో మట్టి రోడ్డుగా మారి ఆనవాళ్లను కోల్పోయిందని ప్రజలు ఆరోపించారు. రోడ్డు పనులు పూర్తి కాక ధారూరు, అల్లీపూర్, మున్నూరుసోమారం గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు ఆరోపించారు. అలాగే తాండూర్–వికారాబాద్‌ల మధ్య వెళ్లే వాహనదారులు ఈ రోడ్డుగుండా వెళితే దూరభారం తగ్గుతుందని వారు పేర్కొన్నారు. అసంపూర్తి రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తే ధారూరు నుంచి మున్నూరుసోమారానికి, వికారాబాద్ వెళ్లడానికి దాదాపు 6 కిలోమీటర్ల దూరభారం తగ్గుతుందని ప్రజలు పేర్కొంటున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా నిధులు కేటాయిస్తారా?

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి దాదాపు 15 నెలలు కావస్తున్నా ఈ అసంపూర్తి రోడ్డు విషయంలో ఎవరు పట్టించుకోవడం లేదని ప్రజలు, వాహనదారులు వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోతే చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తగిన చొరవ తీసుకుని ప్రధానమంత్రి సడక్ యోజన కింద నిధులు మంజూరు చేయించాలని పలువురు కోరుతున్నారు.

ఉద్యోగంలో ఒత్తిళ్లు సహజం

తాండూరు ఎంపీడీఓ విశ్వప్రసాద్



ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులను సన్మానిస్తున్న విశ్వప్రసాద్

తాండూరు రూరల్: ప్రతీ ఉద్యోగంలో ఒత్తిళ్లు సహజమని తాండూరు ఎంపీడీఓ విశ్వప్రసాద్ పేర్కొన్నారు. గురువారం నూతనంగా మండలానికి వచ్చిన ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులు, బదీలిపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగం అనేది గ్రామీణ ప్రాంతాల ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉంటాయన్నారు. గ్రామంలో ఎవరికైనా ఏ సమస్య వచ్చిన ముందుగా గుర్తొచ్చేది పంచాయతీ కార్యదర్శేనన్నారు. గ్రామాల్లో రాజకీయ ఒత్తిళ్లు ఉంటాయని వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని విధులు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో పార్టీలకు అతీతంగా అందరి మాట విని పనులు చేపడితే ఎలాంటి సమస్య ఉండదన్నారు. అనంతరం నూతన ఎంపీఓ సుశీల్‌కుమార్, సంకిరెడ్డిపల్లి, చెంగోల్, కోట బాసుపల్లి పంచాయతీ కార్యదర్శులు మల్లికార్జున్, సుజీత్, శ్రావణిలతో పాటు బదిలీపై వెళ్తున్న లాలప్ప, రశీద్‌లను శాలువా కప్పి పూలమాల వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను రెగ్యులరైజ్ చేసుకోవాలి

ఇన్‌చార్జి డీఎల్‌పీఓ రతన్‌సింగ్



రతన్‌సింగ్

తాండూరు రూరల్: తాండూరు డివిజన్‌లో ప్లాట్ల యజమానులు మార్చి 31 నాటికి ఎల్ఆర్ఎస్‌ను రెగ్యులరైజ్ చేసుకోవాలని ఇన్‌చార్జి డీఎల్‌పీఓ రతన్‌సింగ్ పేర్కొన్నారు. గురువారం డీఎల్‌పీఓ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2020 ఆగస్టు 26 నాటికి దరఖాస్తు చేసుకున్న వారికి ఎల్ఆర్ఎస్‌కు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. తాండూరు డివిజన్‌లో ఏడు మండలాల్లో కలిపి 9,164 దరఖాస్తులు వచ్చాయన్నారు. వెంచర్ యజమానులు ఎల్ఆర్ఎస్ ఫీజు రూ.10 వేలు చెల్లించిన వారు మిగతా ప్లాట్లను కూడా రెగ్యులరైజ్ చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా ఎల్ఆర్ఎస్ ఫీజు రూ.వెయ్యి చెల్లించిన వారు వారి ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఎల్ఆర్ఎస్ చేసుకున్న వారికి ప్రభుత్వం 25 శాతం రాయితీ కూడా కల్పించిందన్నారు. పెద్దేముల్, బషీరాబాద్, యాలాల, తాండూరు మండల కేంద్రాలతో పాటు అంతారం, కందనెల్లి, కోకట్, చెన్‌గేస్‌పూర్, గౌతపూర్‌లో ప్లాట్ల యజమానులు ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చేసిన ప్లాట్లను కూడా ఎల్ఆర్ఎస్ కింద క్రమబద్ధీకరించవచ్చన్నారు.

ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్

కుల్కచర్ల: కుల్కచర్ల మార్కెట్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. గురువారం కుల్కచర్ల మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతాంగ అభ్యున్నతికి, రైతులకు మేలుచేసేవిధంగా కుల్కచర్ల మార్కెట్‌ను వ్యాపారపరంగా అభివృద్ధిచేసేందుకు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సహాయంతో కృషిచేస్తున్నట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలుదారులందరూ ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలని, రాత్రి సమయాల్లో కొనుగోళ్లు నిర్వహించొద్దన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ధాన్యం అమ్మకాలు, సరఫర చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, వ్యవసాయాధికారి వీరస్వామి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్మోహన్ శర్మ, మార్కెటింగ్ శాఖ కార్యదర్శి విజయకిశోర్, డైరెక్టర్లు రాంచంద్రయ్య, భరత్‌కుమార్ రెడ్డి, నీల్యానాయక్, రాంచందర్, బుగ్గమ్మ, తూక్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

హోలీ శాంతియుతంగా నిర్వహించుకోవాలి

ఎస్ఐ యాదగిరి



మాట్లాడుతున్న ఎస్ఐ యాదగిరి

దుద్యాల్: మండల ప్రజలు హోలీని శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ యాదగిరి పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎట్టిపరిస్థితుల్లో గుర్తు తెలియని వ్యక్తులపై రంగులు పూయొద్దన్నారు. ఎలాంటి అల్లరి పనులు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా వేడుకలు నిర్వహించుకోవాలన్నారు. విషపూరితమైన రంగులను వినియోగించొద్దని సూచించారు.

‘వక్ఫ్’ ప్రస్తుత విధానాలను కొనసాగించాలి



మాట్లాడుతున్న మహ్మద్ వసీం

యాలాల: వక్ఫ్ బోర్డు బిల్లులో భాగంగా ప్రస్తుత విధానాలను కొనసాగించాలని తెలంగాణ స్టేట్ మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ వసీం డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డు కొత్త చట్టం తెచ్చేందుకు పార్లమెంటులో నిర్వహిస్తున్న చర్చనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ముస్లిం సంఘాల ఆస్తి, సాంస్కృతిక, ఆర్థిక హక్కులను కొత్త చట్టం హరించే అవకాశం ఉందన్నారు. కొత్త చట్టం వల్ల ముస్లింలకు ఊహించని నష్టాలు, అస్థిరతను కలిగించే అవకాశం ఉందన్నారు. వక్ఫ్ బోర్డులో ఇప్పటివరకు ప్రభుత్వం కొన్ని పాయింట్లను పునః సమీక్షించాలని ఆయన కోరారు. ఈ విషయమై ఇప్పటికే సమాజసేవ సంస్థలు, న్యాయవాద సంఘాలు, స్థానిక నాయకులతో కలిసి ముందుకు వెళ్లేందుకు చర్చలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బొంరాస్‌పేట: ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో వక్ఫ్‌బోర్డు బిల్‌కు సంబంధించి చర్చ జరుగుతున్న నేపథ్యంలో కొత్త చట్టాలు అమలు చేయొద్దని మైనార్టీ సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ స్టేట్ మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మొహమ్మద్‌వసీమ్ కీలక వ్యాఖ్యలు చేశారు. పాతవిధానాలను అమలు పర్చడం వల్ల ముస్లిం సంఘాల ఆస్తి, సాసంస్కృతిక, ఆర్థిక హక్కులను కాపాడవచ్చని వాదన వినిపించారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించండి



సీఐ వెంకట్‌ను సన్మానం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మర్పల్లి: ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆయా కళాశాల ఇన్విజిలేటర్లకు, పోలీసులకు సీఐ వెంకట్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. మాస్ కాపీంగ్‌కు పాల్పడొదన్నారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. ఇక్కడ గుంపులుగా ఉండొద్దని, 144 సెక్షన్‌ను పకడ్బందిగా అమలు చేయాలని ఎస్ఐ సురేష్‌కు ఆదేశించారు. అనంతరం మర్పల్లి పోలీస్ స్టేషన్‌ను మొదటి సారిగా తనిఖీ చేశారు.

సీఐకి సన్మానం

సీఐగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన జీ వెంకట్ మొదటి సారి మండల కేంద్రానికి వచ్చారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేష్, బ్లాక్–2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి, గూడెం రాములు యాదవ్ సీఐ వెంకట్‌ను వ్యవసాయ మార్కెట్‌లో సన్మానం చేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాక్ అసెంబ్లీ



మాక్ అసెంబ్లీలో విద్యార్థులు కళాశాల అధ్యాపక సిబ్బంది

కొడంగల్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మాక్ అసెంబ్లీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి నిర్వహించిన కార్యక్రమంలో అధికార, ప్రతిపక్ష నేతలుగా విద్యార్థులు వ్యవహరించిన తీరును అధ్యాపక సిబ్బంది అభినందించారు. ముఖ్యమంత్రిగా అశ్విని, స్పీకర్‌గా విజయలక్ష్మి, విద్యాశాఖ మంత్రిగా నజ్మాకాథోన్, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా మమత, రవాణాశాఖ మంత్రిగా అంబిక, నీటి పారుదల శాఖ మంత్రిగా రజిత, వ్యవసాయశాఖ మంత్రిగా శివకుమార్, ఆర్థికశాఖ మంత్రిగా శిరీష, హోమ్‌శాఖ మంత్రిగా ఎం.ప్రవీణ్‌కుమార్, ప్రతిపక్ష నేతగా జి.అఖిల మరికొంత మంది విద్యార్థులు ప్రతిపక్ష నేతలుగా వ్యవహరిస్తూ మాక్ అసెంబ్లీని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రఫియాఖానమ్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ టి.రాంబాబు, న్యాక్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, సోమ్లానాయక్, ఎం.నారాయణ పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు హోలీ సంబరాలు



కుల్కచర్ల: చెల్లాపూర్ పాఠశాలలో..

పరిగి: మండల పరిధిలోని మిట్టకోడూర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం హోలీ సంబరాలు నిర్వహించారు. పండుగ సందర్భంగా విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం హోలీ ప్రాముఖ్యత గురించి ప్రధానోపాధ్యాయుడు ఉస్మాన్ అలీ వివరించారు.

కుల్కచర్ల: హోలీ పురస్కరించుకుని కుల్కచర్ల, చౌడాపూర్ మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు ముందస్తుగా హోలీ సంబరాలను నిర్వహించుకున్నారు. గురువారం చెల్లాపూర్ పాఠశాలలో చిన్నారులు ఒకరినొకరు రంగులు చల్లుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, ఉపాధ్యాయులు దస్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో హోలీ వేడుకలు జరుపుకున్నారు.

గ్రామం పేరు మార్చాలని ఎంపీకి వినతి



గ్రామం పేరు మార్చాలని ఎంపీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

నవాబుపేట: గ్రామం పేరు మార్చాలని కోరుతూ కొజ్జవనంపల్లి మాజీ సర్పంచ్ రత్నం గురువారం మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం సమక్షంలో ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ మండల పరిధిలోని కొజ్జవనంపల్లి పేరును గేట్‌వనంపల్లిగా మార్చాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందించలేదన్నారు. ఎంపీగా స్పందించి గ్రామం పేరు మార్చేవిధంగా తగిన చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కడ్చర్ల గ్రామ నాయకుడు రాంచంద్రయ్య ఉన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మహేందర్‌రెడ్డి

మర్పల్లి: అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ రోడ్డు నుంచి ఎస్టీ ఆశ్రమ గురుకుల పాఠశాల సమీపం వరకు ఉపాధిహామీ పథకం కింద సీసీ రోడ్డు వేసేందుకు మంజూరైన రూ.40 లక్షలతో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మల సురేశ్, బ్లాక్–2 అధ్యక్షుడు మల్కనెల్లి కృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు రాములు యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లేశ్‌యాదవ్, మాజీ వైస్ చైర్మన్ రామేశ్వర్‌తో పాటు పంచాయత్‌రాజ్ శాఖ డీఈ, ఏఈఈలతో కలిసి ఆయన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుందన్నారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ సహకారంతో మర్పల్లి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ ఫసి, మార్కెట్ డైరెక్టర్లు కృష్ణారెడ్డి, పాండునాయక్, యాదగిరి, నర్సింలు, మాజీ సర్పంచ్ సలీం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ

ఆలేడ్‌లో రూ. 26లక్షల పనులకు ఆడిట్



దుద్యాల్: ఆలేడ్‌లో నిర్వహించిన గ్రామ సభ



కొడంగల్ రూరల్: చిన్ననందిగామలో సామాజిక తనఖీ బృందం సభ్యులతో గ్రామస్తులు

దుద్యాల్: మండల పరిధిలోని ఆలేడ్ గ్రామంలో ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీలకు సంబంధించిన గ్రామ సభను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో గ్రామంలో చేపట్టిన లెవలింగ్, పండ్ల తోటల గుంతలు, పశువుల పాకలు వంటి వివిధ రకాల పనులకు సంబంధించి రూ.26,0570ల పనులు నిర్వహించారు. దీనికి సంబంధించిన సామాజిక తనిఖీలను నాలుగు రోజులు నిర్వహించారు. పనులు చేసిన ప్రతీ ఒక్క కూలీ ఇంటికి వెళ్లి వివరాలను ఆడిట్ అధికారులు సేకరించారు. అనంతరం గురువారం గ్రామంలోని పాఠశాల గదిలో గ్రామ సభను నిర్వహించి ఆడిట్ అధికారి అనిల్ వివరాలు వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామంలో రూ. 26,00,570 విలువగల రోడ్డు, లాండ్ లెవలింగ్, నర్సరీలు, పశువుల పాకలు వంటి వివిధ రకాల ఉపాధి హామీ పనులు నిర్వహించారన్నారు. అన్ని పనులు కూడా సక్రమంగానే జరిగాయని, ఎలాంటి అవకతవతకలు లేవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రాములు, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ , ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని చిన్ననందిగామలో గురువారం సామాజిక తనిఖీ బృందం సభ్యులు ఏడాదిగా నిర్వహించిన ఉపాధిహామీ పనులను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఉపాధిహామీ పనులకు సంబంధించిన వివరాలు తెలుసుకొని సమావేశంలో చదివి వినిపించారు. సామాజిక తనఖీ బృందం సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన సామాజిక తనిఖీ ప్రజావేదికలో గ్రామంలో నిర్వహించిన పనుల వివరాలు అందజేస్తామని తెలిపారు.

బంట్వారం: ఎన్ఆర్ఈజీఎస్ పనులపై మండలంలో గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. గురువారం రొంపల్లి, తొర్మామిడి గ్రామాల్లో సోషల్ ఆడిట్ నిర్వహించారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు చేపట్టిన పనులు, ఖర్చు చేసిన నిధులపై వివరాలు సేకరించారు. ఏడాది కాలంలో రూ 7.68 కోట్లతో చేపట్టిన పనులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి కూలీలతో మాట్లాడారు. మరో మూడు రోజుల పాటు సభలు నిర్వహించి మండల స్థాయిలో ప్రజా వేదిక నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్పీ శ్రీకాంత్, ఎస్ఆర్పీ రమేశ్, ఈసీ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ అశోక్‌రెడ్డి, వీఎస్ఏలు, కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో శ్రద్ధ అవసరం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ హరిలాల్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

బొంరాస్‌పేట: విధి నిర్వహణలో శ్రద్ధగా పనిచేయాల్సిన అవసరం ఉందని మండల విద్యాధికారి హరిలాల్ పేర్కొన్నారు. మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయినీలకు గురువారం వీడ్కోలు పలికారు. పాఠశాలలో పనిచేసిన హెచ్ఎం భూదేవి, ఉపాధ్యాయిని సత్యవతిలకు నిర్వహించిన సమావేశంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాలు పీఆర్‌టీయూ, టీపీయూఎస్, యూటీఎఫ్‌ల నాయకులు అనిల్‌కుమార్, బాకారం చంద్రశేఖర్, బాకారం మల్లయ్య, శ్రీప్రియ, మేరాజ్, మల్లేశం, పరమేశ్వరి, పాఠశాల హెచ్ఎం లావణ్య, ఉపాధ్యాయులు సాయిలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

నవాబుపేట: విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంపీడీవో అనురాధ పేర్కొన్నారు. మండల పరిధిలోని పునుమామిడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎంతోమంది విద్యార్థులు నేడు ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జైరాం, ప్రధానోపాధ్యాయుడు వేంకటేశం, మల్లేశం, ఉపాధ్యాయుడు గోపాల్, విజయ్ కుమార్, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



పూడూరు: ఉపాధ్యాయులుగా విద్యార్థులు

పూడూరు: భవిష్యత్ తరాలకు వెలుగునిచ్చేది విద్య మాత్రమేనని, విద్యతోనే ప్రపంచాన్ని గెలవచ్చని పాఠశాల హెచ్ఎం మధు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని కడుమూరు పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు ఒక్కరోజు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీకాంత్, విఠల్, అనూష, హరీష్, బాబు, మొర్రి అనీల్ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన జూనియర్ లెక్చరర్లు

తాండూరు టౌన్: తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముగ్గురు కొత్త జూనియర్ లెక్చరర్లు గురువారం విధుల్లో చేరినట్లు కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ మల్లినాథప్ప పేర్కొన్నారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జూనియర్ లెక్చరర్లు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు తీసుకున్న విషయం విదితమే. దీనిలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రకాశ్ (హిందీ), డి అరుణ్ కుమార్ (గణితం), ఎస్‌డి సిరాజుద్దీన్ (ఉర్దూ జువాలజీ) జూనియర్ లెక్చరర్లుగా చేరారన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు



పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేస్తున్న రమేశ్, కాంగ్రెస్ శ్రేణులు

మర్పల్లి: పదోతరగతి విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికావద్దని, పరీక్షలు ప్రశాంతంగా రాయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మల సురేష్, పార్టీ సీనియర్ నాయకులు రాములు యాదవ్ పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన టీఎస్ ఉద్యమ కారుడు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రామేశ్వర్ గురువారం మర్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యువసేన స్వచ్ఛంద సంస్థ మండల నాయకుడు బక్క మైపాల్, సహకార సంఘం వైస్ చైర్మన్ ఫసి, మండల నాయకులు దివాకర్, అనంత్‌రెడ్డి, మొల్లన్న, శేఖర్, నవీన్, బబ్లూ, లింగం, జైపాల్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

ఇన్‌చార్జి ఎంపీఓ భాస్కర్



మురుగుకాల్వలను పరిశీలిస్తున్న భాస్కర్ గౌడ్

కుల్కచర్ల: గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సమస్యలు పరిష్కరిస్తామని కుల్కచర్ల ఇంచార్జి ఎంపీఓ భాస్కర్ పేర్కొన్నారు. గురువారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామ పంచాయతీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తాగునీరు, మురుగు కాల్వలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మౌలిక వసతుల సౌకర్యాల కల్పనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ తగిన జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులకు, బాలింతలకు పోషకాహారాన్ని అందించాలని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి జహంగీర్ పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై నైపుణ్యం పెంపొందించుకోవాలి

కుల్కచర్ల: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక అంశాలు, జనరల్ నాలెడ్జ్‌లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని పుట్టపహడ్ జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అజ్మతుల్లా పేర్కొన్నారు. గురువారం కుల్కచర్ల మండల పరిధిలోని పుట్టపహడ్ గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో క్లస్టర్ పరిధిలోని ఆయా పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలతో పాటు సమాజంలోని అన్ని అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. క్విజ్ పోటీల్లో అనంతసాగర్ ప్రాథమిక పాఠశాల మొదటి స్థానంలో నిలిచింది. ఉపాధ్యాయులు చిరంజీవి, నవీన్‌కుమార్, యాదగిరి, శ్రీశైలం, పాల్గొన్నారు.